క్లుప్తంగా

నేడు కిష్టస్వామి జాతర



ఆలయంలో కొలువుదీరిన వేణుగోపాల స్వామి

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి గ్రామ శివారు మోయతుమ్మెద వాగు తీరాన వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి (కిష్టస్వామి) జాతర సోమవారం జరగనుంది. వారం క్రితం స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ చైర్మన్ ముప్పిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు చేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీఓ రామ్మూర్తి



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేలా ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన 5కే రన్‌ను ఆర్డీఓ రామ్మూర్తి ప్రారంభించారు. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్ర, ఎలక్షన్ డీటీ రుక్మిణీ, ఎస్ఐ మహేష్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణం



ఎల్లారెడ్డిపేటలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

తొగుట(దుబ్బాక): మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. మండల కేంద్రమైన తొగుట, ఎల్లారెడ్డిపేట, జప్తిలింగారెడ్డిపల్లి, ఘనపురం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మండలానికి రూ.75 లక్షలు మంజూరు చేయించారు. మండల కేంద్రమైన తొగుట బీసీ కాలనీకి రూ.20 లక్షలు, ఎల్లారెడ్డిపేటకి రూ.10 లక్షలు, ఘనపురం గ్రామానికి రూ.20 లక్షలు, జప్తిలింగారెడ్డిపల్లికి రూ.10 లక్షలు, లింగాపూర్ గ్రామానికి రూ.15 లక్షలు కేటాయించారు.

ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఎన్నిక



నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు రవి బాబు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల ధర్మ సమాజ్ పార్టీ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కేశపాక మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా కాకి మల్లేశం, ఉపాధ్యక్షుడిగా నర్మెట వెంకటేష్, సహాయ కార్యదర్శిగా డి.రాజేష్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి బాబు సమక్షంలో జరిగాయి. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ప్రభాకర్, చందు, యాదగిరి, లక్ష్మణ్, నందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్లు



దుబ్బాక నుంచి ముస్తాబాద్ వెళ్లేదారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

దుబ్బాక: రోడ్డుకు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు రైతులు, వాహనదారులను కలవర పెడుతున్నాయి. దుబ్బాక మండల వ్యాప్తంగా చాలా చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. దుబ్బాక నుంచి ముస్తాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తు తగ్గడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్లను తగినంత ఎత్తులో అమర్చాలని కోరుతున్నారు.

కొలువుల నిలయం

ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ రాగానే నిరుద్యోగులు పట్టణం బాట పట్టేవారు. కోచింగ్ సెంటర్లలో శిక్షణ, ప్రైవేట్ హాస్టల్స్‌లో వసతి, ప్రైవేట్ స్టడీ హాళ్లలో ఉద్యోగ పోటీపరీక్షలకు సిద్ధమవడం సాధారణ మధ్య తరగతి వారికి తలకు మించిన ఆర్థిక భారంగా ఉండేది. ఆర్థిక స్థోమతలేనివాళ్లు ఉద్యోగ ఆశలు వదులుకునేవాళ్లు. ఇది ఒకప్పటి మాట, ఇప్పుడు పరిస్థితి మారింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో అన్ని వసతులతో గ్రంథాలయం అందుబాటులోకి రావడంతో నిరుద్యోగ అభ్యర్థులకు కల్పవృక్షంగా మారింది.

- నిరుద్యోగులకు అండగా సిద్దిపేట లైబ్రరీ
- అన్ని వసతులతో ఏర్పాటు
- ఏడాదిలో వంద మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన నిరుద్యోగులు
- నిరుపేద కుటుంబాల్లో వెలుగులు



సిద్దిపేట గ్రంథాలయంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

ప్రశాంత్ నగర్ (సిద్దిపేట): అన్ని వసతులు, వేలాది పుస్తకాలతో జ్ఞాన బాంఢాగారం అందుబాటులోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు చిరునామాగా మారింది సిద్దిపేట లైబ్రరీ. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది ఈ గ్రంథాలయమే. ఇందులో లభించే పోటీ పరీక్షల పుస్తకాలను చదివి నిరుద్యోగులు పోటీ పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక పరీక్షలో సిద్దిపేట జిల్లాలో వందకుపైగా అభ్యర్థులు ఎంపిక కావడం విశేషం. మెదక్, సంగారెడ్డి జిల్లాల అభ్యర్థులు సైతం ఈ లైబ్రరీలో ప్రిపేరై ఉద్యోగాలు సాధించారు. జిల్లా అభ్యర్థులే కాకుండా మెదక్, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, జనగాం జిల్లాల అభ్యర్థులు సైతం స్థానికంగా గదులు అద్దెకు తీసుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతుండటం గమనార్హం. ఇటీవల ప్రకటించిన స్టాఫ్ నర్సు ఫలితాలలో లైబ్రరీలో చదివిన 20 మందికి పైగా ఉద్యోగాలు సాధించారు. జిల్లా స్థాయి పోస్టులు కావడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కాగా గతంలో మధ్యాహ్నం భోజనం వసతి ఉండేదని, మళ్లీ మధ్యాహ్న భోజనం పునరుద్ధరించాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు.

నేను, నా తమ్ముడు ఉద్యోగం సాధించాం



రెండేళ్లు నా తమ్ముడుతో కలిసి లైబ్రరీలో ప్రిపేరయ్యాను. గురుకుల నోటిఫికేషన్‌లో జేఎల్, టీజీటీ రెండు ఉద్యోగాలు సాధించాను. నా తమ్ముడు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఈ లైబ్రరీలో ఉన్న సౌకర్యాలు, వాతావరణం మమ్మల్ని ఎంతో ప్రభావితం చేశాయి. జీవితాంతం లైబ్రరీ గుర్తుండి పోతుంది.

– స్రవంతి, గురుకుల జూనియర్ లెక్చరర్

గ్రంథాలయంలో చదవడం నా అదృష్టం



సిద్దిపేటలో అన్ని వసతులతో గ్రంథాలయం ఉండటం మా అదృష్టం. ప్రశాంత వాతావరణంలో ఉండటం వల్ల శ్రద్ధగా చదువుకోగలిగాం. ఇంటర్నెట్, ఫ్రీ వైఫైతో ప్రపంచ సమాచారం తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడింది. లైబ్రరీలో అన్ని వసతులు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గర్వంగా ఉంది.

– దామోదర్, తొగుట, కానిస్టేబుల్

మా జీవితాల్లో వెలుగులు నింపింది



మాది మెదక్ జిల్లా పాపన్న పేట మండలం. రెండేళ్లు సిద్దిపేటలో రూమ్ అద్దెకు తీసుకొని స్నేహితులతో కలిసి లైబ్రరీలో చదువుకున్నాను. లైబ్రరీలో మధ్యాహ్నం భోజనం పెట్టడం వల్ల చాలా సమయం ఆదా అయ్యింది. నాలాంటి ఎంతో మంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది. సిద్దిపేట లైబ్రరీకి జీవితాంతం రుణపడి ఉంటాను.

– సందీప్‌రెడ్డి, పాపన్నపేట, కానిస్టేబుల్

సిద్దిపేట లైబ్రరీకి రుణపడి ఉంటాను



ప్రభుత్వ ఉద్యోగ సాధన కోసం మొదట హైదరాబాద్ వెళ్లా. ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ, ప్రైవేట్ స్టడీహాల్‌లో చదువుకున్నా. స్నేహితుడి ద్వారా సిద్దిపేట లైబ్రరీ గురించి తెలుసుకున్నా. ఏడాది రూమ్‌లో ఉండి లైబ్రరీలో చదువుకున్నా. గురుకుల ఫలితాలలో టీజీటీ తెలుగు ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యాను.

– చెన్న రాజు, దౌల్తాబాద్, గురుకుల టీజీటీ

పీసీసీ ఆదేశాల మేరకు నేనే అధ్యక్షుడిని



నియామక పత్రం చూపుతున్న శ్రీనివాస్‌గుప్త

ములుగు(గజ్వేల్): పీసీసీ ఆదేశాల మేరకు తానే కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతానని శ్రీనివాస్‌గుప్త స్పష్టం చేశారు. ఆదివారం ములుగులో కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తనను తొలగిస్తున్నట్లు ప్రకటించడం సరికాదన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారిని పక్కన పెట్టడం గ్రూపులను ప్రోత్సహించినట్లవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి కారణం చూపకుండా తన స్థానంలో మరొకరిని అధ్యక్షుడిగా నియమించిన అంశాన్ని హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లానని వివరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, నల్ల శ్రీనివాస్, సింగం రాజు, సీతారాంరెడ్డి, ప్రకాశ్, బాబు, నరసింహారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు బహుమతులు



కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేటజోన్: అంబిటస్ పాఠశాలలో ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 150 మంది పోటీల్లో పాల్గొన్నారు. కుమిత్తే, కటాస్, స్పైరింగ్, వేపన్ అటాక్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. సౌత్ ఇండియా చీఫ్ సుదర్శన్ సమక్షంలో పోటీలు జరిగాయి. విజేతలకు ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మమత ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జోనల్ చీఫ్ భాగ్యరాజ్, జిల్లా చీఫ్ ఆంజనేయులు, మాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



లద్నూర్ గ్రామంలో వేడుకలు

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లోని చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు క్రీస్తు వేషధారణలో ఈత మట్టలు పట్టుకుని గ్రామాల్లో కలియ తిరుగుతు ఏసుక్రీస్తు గీతాలు ఆలపించారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మట్టల ఆదివారం సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని రామునిపట్లలో క్రైస్తవులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో ఖర్జూర మట్టలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు దినేష్, యేసు రత్నం, రవి, రూబెన్ పాల్గొన్నారు.

నర్సారెడ్డిని విమర్శిస్తే పుట్టగతులుండవు

కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి



వర్గల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ రంగారెడ్డి

వర్గల్(గజ్వేల్): రాజకీయాల్లో సర్వం కోల్పోయిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని విమర్శిస్తే పుట్టగతులుండవని, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తన పద్ధతి మార్చుకోకుంటే గుణపాఠం తప్పదని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి హెచ్చరించారు. ఆదివారం వర్గల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితర నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతాప్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. వర్గల్ అంటేనే ప్రతాప్‌రెడ్డి వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ఆర్డీసీ చైర్మన్ పదవిని త్యాగం చేసిన నర్సారెడ్డిని విమర్శించడం సిగ్గుచేటని మండిపడ్డారు. భూ ఆక్రమణలకు పాల్పడినట్లు ప్రతాప్‌రెడ్డి నిరూపిస్తే వాటిని పేదలకు పంచేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల కాలంలో ప్రతాప్‌రెడ్డి రూ.వందల కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని, తమ పార్టీ కార్యకర్తలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం మంజూరు చేయాలి

కోహెడ(హుస్నాబాద్): నీళ్లులేక ఎండిన వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. వర్షాభావంతో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రభుత్వం పంట నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. రైతులకు రైతు భరోసా పథకం తక్షణమే అమలు చేయాలని కోరారు.

ఈసీకి టీపీసీసీ సభ్యుడి ఫిర్యాదు



మాట్లాడుతున్న టీ పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎలక్షన్ కోడ్‌ను బీఆర్ఎస్ పార్టీ ఉల్లంఘించిందని, ఆ పార్టీపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని టీపీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫ్లెక్సీలను తొలగించలేదన్నారు. ఈవిషయంపై ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సతీష్, నియోజకవర్గ అధ్యక్షులు బడేకోల్ రాకేశ్ యాదవ్, మొగిలి రాకేశ్ పాల్గొన్నారు.

నేడు ఆనందయ్య జాతర

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో సోమవారం ఆనందయ్య జాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా హోలీ రోజున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారన్నారు. స్వామివారికి అభిషేకం, అన్నపూజ, అన్నప్రసాదం, రథోత్సవం నిర్వహిస్తారు. జాతర ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2003-04 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

చేర్యాల: (సిద్దిపేట): మండలంలోని తాడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మేఘమాల, యాదగిరి, సురేందర్, నర్సింహులు, శ్రీనివాస్, శ్రీరాములు, శ్రీనివాసును సత్కరించారు.

మట్టి స్నానంతో ప్రయోజనం



మట్టి స్నానం చేసిన యోగా శిక్షణ పొందినవారు

సిద్దిపేటజోన్: మట్టి స్నానం (మడ్ బాత్)తో రోగాలు దూరమవుతాయని, మనిషికి ఎంతో ప్రయోజనమని వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, యోగ శిక్షకుడు సతీష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక చంద్రమౌళి గార్డెన్‌లో సొసైటీ ఆధ్వర్యంలో మడ్ బాత్ నిర్వహించారు. మడ్ బాత్ అనాది కాలం నుంచి ఉందన్నారు. ప్రత్యేకమైన మట్టిలో వివిధ రకాల ఔషదాల మిశ్రమంతో లేపనం చేసి దానిని దేహానికి రాసి సూర్యరశ్మిలో గంటసేపు ఉంటే ఎన్నో లాభాలు కలుగుతాయన్నారు. పెద్దసంఖ్యలో మడ్ బాత్ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రం రెడ్డి, సొసైటీ ప్రతినిధులు అశోక్, అంజయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జోలికొస్తే ఖబడ్దార్



దుబ్బాకలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ హెచ్చరించారు. ఆదివారం దుబ్బాకలో వారు విలేకర్లతో మాట్లాడారు. వ్యక్తిగత స్వార్థం కోసం డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిపై ప్రతాప్‌రెడ్డి విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గడ్డం శ్రీనివాస్, కర్నాల రమేష్‌గౌడ్, మల్లుగారి చంద్రారెడ్డి, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవానికి ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాదిగ

మిరుదొడ్డి(దుబ్బాక): మాదిగల ఆత్మ గౌరవానికై ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం అక్బర్‌పేట–భూంపల్లి మండల ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు సీట్లు కేటాయించాలన్నారు. మాదిగలను ఓటు బ్యాంకుగా చూసే పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పక తప్పదన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం కాలయాపన చేయకుండా కార్యాచరణ మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సిద్దిని రాజమల్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు నర్సింహులు, మండల అధ్యక్షుడు కాకి యాదగిరి, ప్రధాన కార్యదర్శి సుక్క మనోహర్, అధికార ప్రతినిధి రాజలింగం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎదురు బాలరాజు, నాయకులు మల్లేశం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆరె క్షత్రియ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలో ఆరె క్షత్రియ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుగుల కరుణాకర్, ఉపాధ్యక్షులుగా బూర్గుల రాజేష్, బూర్గుల రాజు, ప్రధాన కార్యదర్శిగా కుసుంబ హరికిషన్, సహాయ కార్యదర్శిగా కుసుంబ సతీష్, కోశాధికారిగా బూర్గుల కనకారావు, సభ్యులుగా రాజేశ్వర్‌రావు, బూర్గుల బాలయ్య, బూర్గుల వెంకటరమణ, ఇరువాల కాంతారావు, గాజుల పాటి రాజు ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

◆ **బెజ్జంకి పోలీస్ స్టేషన్ సందర్శన**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను సిద్దిపేట ఏసీపీ మధు ఆదివారం సందర్శించారు. క్రైం రికార్డులు పరిశీలించారు. మండల పరిస్థితుల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ నిర్వహణకు ఎస్ఐ క్రిష్టారెడ్డి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

◆ **భువనగిరి ఎంపీ సీటు కేటాయింపుపై హర్షం**

మద్దూరు(హుస్నాబాద్): భువనగిరి పార్లమెంట్ సీటు బీఆర్ఎస్ పార్టీ కురుమలకు కేటాయించడం హర్షనీయమని దూళ్మిట్ట మండల కురుమ సంఘం అధ్యక్షుడు రాజమల్లయ్య కురుమ అన్నారు. ఈ మేరకు ఆదివారం దూళ్మిట్టలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా క్యామ మల్లేశం కురుమకు సీటు కేటాయించి కురుమల పట్ల తన అభిమానాన్ని మరోసారి చాటారన్నారు. మల్లేశం విజయానికి కురుమలందరం ఐకమత్యంగా కృషి చేస్తామన్నారు.

◆ **కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్**

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గౌరారం గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం గౌరారంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, కాంగ్రెస్ నాయకులు తాల్ల భానుగౌడ్, పూదరి కరుణాగౌడ్, గుండు నర్సింలుగౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **పరిశోధనా గ్రంథం అందజేత**

హుస్నాబాద్: ఎల్లమ్మ దేవత జాతర అంశంపై పరిశోధన చేసిన శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీ విద్యార్థి బోయిని సునీల్ డాక్టరేట్ సాధించాడు. 2024 ఫిబ్రవరి 2వ తేదీన తెలుగు యూనివర్సిటీ 16వ స్నాత కోత్సవంలో అప్పటి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా సునీల్ ఎంఫిల్ పట్టా అందుకున్నాడు. ఆయన ఆదివారం తన పరిశోధన గ్రంథాన్ని ఆలయ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ గౌడ్‌కు అందజేశారు.

◆ **మోదీ పాలనలోనే అభివృద్ధి సాధ్యం**

గజ్వేల్‌రూరల్: ప్రధాని మోదీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో చర్చకు దారితీసిన నర్సారెడ్డి, ప్రతాప్‌రెడ్డిల మాటల మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. గజ్వేల్ అభివృద్ధిపై 2014కు ముందు నర్సారెడ్డి, బీఆర్ఎస్‌లోకి వెళ్లిన తర్వాత ప్రతాప్‌రెడ్డి ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గజ్వేల్‌కు రైలు, ములుగులో కేంద్రీయ విశ్వవిద్యాలయం మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

◆ **గంజాయి విక్రేతల అరెస్ట్**

జగదేవ్‌పూర్(గజ్వేల్): గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం జగదేవ్‌పూర్ నుంచి మునిగడప వెళ్లే రోడ్డులో బైక్‌లపై అనుమానాస్పదంగా తిరుగుతున్న మండలానికి చెందిన ఆకాష్, శశిధర్, మహిపాల్, నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా గంజాయి విక్రయిస్తున్నామని, మునిగడప గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వెంటనే ఎస్ఐ మునిగడప గ్రామానికి వెళ్లి నవీన్‌కుమార్ ఇంట్లో తనిఖీ చేయగా 625 గ్రాముల గంజాయి, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **అంబేడ్కర్ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక**

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలో అంబేడ్కర్ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా బాకి రాజు, ప్రధాన కార్యదర్శిగా రోశిలి కిషన్, ఉపాధ్యక్షులుగా చినిగారి రామకృష్ణ, కొమ్ము నర్సింహులు, కోశాధికారిగా కొడాయిపల్లి ఎల్లం, సహాయ కార్యదర్శులుగా రోశిలి నాగరాజు, పల్లె అరుణ్, క్రీడల కార్యదర్శిగా పల్లె సంపత్, ప్రచార కార్యదర్శులుగా బాకి రాజశేఖర్, రోశిలి కరుణాకర్, సాంస్కృతి కార్యదర్శిగా పల్లె బాబు, కార్యనిర్వహణ అధికారిగా పిల్లి శివరాజీల, మరి కొందరు సలహాదారులు, సభ్యులుగా ఎన్నికయ్యారు.